

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 06-06-2025 | సంపుటి - 24 | సంచిక - 35 | రూ : 4 | పేజీలు: 8




## పుడమిని... పరిరక్షించుకుందాం

- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మోదీ పిలుపు
- 'సిందూర' మొక్క నాటిన ప్రధాని

**జూన్ 05, దిల్లీ:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని తన అధికార నివాస ప్రాంగణంలో గురువారం 'సిందూర' మొక్కను నాటారు.

తరువాయి 2లో

# ఉద్యోగులకు రెండు డీఏలు





- వెంటనే ఒకటి.. ఆర్నెల్ల తర్వాత మరొకటి
- నెలకు రూ. 700 కోట్ల చొప్పున బకాయిల చెల్లింపు
- ఉద్యోగి భాగస్వామ్య చెల్లింపుతో వైద్య చికిత్సలు
- సీఎస్ చైర్మన్‌గా ప్రత్యేక ట్రస్ట్
- మహిళా సంఘాల సభ్యులు మృతిచెందితే రూ. 10 లక్షలు
- హ్యామ్ విధానంలో రోడ్లకు పచ్చజెండా
- మెట్రో రెండోదశ విస్తరణకు ఆమోదం
- మంత్రిమండలి భేటీలో కీలక నిర్ణయాలు

2లో

# ఆర్కైవ్స్‌పై విజిలెన్స్

- రంగంలోకి నిఘా బృందాలు.. విచారణ ఆరంభం
- రాజ్యాభిలేఖ పరిశోధనాలయంలో వాంగ్మూలాల సేకరణ

**జూన్ 05, హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (రాజ్యాభిలేఖ పరిశోధనాలయం)లో అక్రమ కార్యకలాపాలను నిగ్గు తేల్చడంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దృష్టి సారించింది. విచారణ కోసం అదనపు ఎస్పీ ఆనంద్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించింది. ఆర్కైవ్స్‌లోని విలువైన దస్త్రాలు

తరువాయి 2లో





# 'సీమ'కు పారిశ్రామిక హంగు

- ఏడాదిలో రూ.1.59 లక్షల కోట్ల పెట్టుబడులు
- 46 భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులు
- 1.26 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- విద్యుత్ హబ్‌గా రూపాంతరం
- రక్షణ పరిశ్రమలతో ప్రపంచవ్యాప్త గుర్తింపు

**జూన్ 05, అమరావతి :** ఐదేళ్ల వైకాపా పాలన.. రాయలసీమను ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయింది. కొప్పర్తి నోడ్, కావాల్సినవారికి సౌర, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టుల కేటాయింపు మినహా.. సీమ గతిని మార్చేలా నిర్దిష్టమైన ప్రయత్నాలు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాయలసీమ పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. ఏడాదిలోనే రూ.1.59 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రేపోమాపో కడప ఉక్కు పనులు మొదలు కాబోతున్నాయి. రక్షణరంగ పరిశ్రమలూ రానున్నాయి. కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌ల అభివృద్ధికి కేంద్రం నిధులిచ్చింది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పారిశ్రామికవేత్తలను బెదిరించి రాష్ట్రం నుంచి తరిమేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ పారిశ్రామికాభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేస్తోంది. భారీ పెట్టుబడులతో పరిశ్రమలు, పునరుత్పాదక ప్రాజెక్టులు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఏడాదిలోనే రూ.1,59,080

తరువాయి 2లో

## పొగాకు, మామిడి, కోకో రైతులకు ఊరట

- నేటి నుంచి 7 మార్కెట్ యార్డుల్లో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు
- ప్రాసెసింగ్ మామిడి రకాలకు కిలో రూ.12
- కోకో కిలో ధర రూ.500..
- సీఎం సమీక్షలో నిర్ణయం



**జూన్ 05, అమరావతి:** రాష్ట్రంలో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, మద్దిపాడు యార్డుల ద్వారా శుక్రవారం నుంచే సేకరణ ప్రారంభించనున్నారు. ఇక, ప్రాసెసింగ్ రకం మామిడికి కిలో రూ.12 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాలని ఆహారశుద్ధి పరిశ్రమలు, ట్రేడర్లను ఆదేశించింది. ఇందులో వ్యాపారులు రూ.8, ప్రభుత్వం రూ.4 చొప్పున భరించాలని నిర్ణయించింది. కోకో రైతులకు కిలోకు రూ.500 దక్కేలా.. వ్యాపారులు రూ.450, ప్రభుత్వం రూ.50 చొప్పున చెల్లించనుంది.

తరువాయి 2లో

# ఉగ్రవాదుల ఆవాసాలపై ఎన్ఐఏ దాడులు

- జమ్మూకశ్మీర్‌లోని 32 ప్రాంతాల్లో సోదాలు

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని 32 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గురువారం సోదాలు నిర్వహించింది. ఉగ్రమూకల ఆవాసాలు,

తరువాయి 2లో




# తలపై తుపాకీ గురిపెట్టిన పాక్‌తో చర్చలుండవ్

**ఉగ్ర శక్తులను నియంత్రించకపోతే మళ్లీ దాడులు చేస్తాం: థరూర్**

- అమెరికా పర్యటనలో పలువురితో భారత బృందం భేటీ

వాషింగ్టన్: తలపై తుపాకీ గురిపెట్టిన పాకిస్థాన్‌తో చర్చలు ఉండబోవని అమెరికాలో పర్యటిస్తున్న పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పష్టం చేశారు. తన భూభాగంలోని ఉగ్రవాద శక్తులను ఆ దేశం నియంత్రించకపోతే భారత్ ఇప్పటిలాగే మళ్లీ దాడులు చేస్తుందని హెచ్చరించారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌లో పలువురు ప్రజాప్రతినిధులతో భారత బృందం భేటీ అయిన అనంతరం నేషనల్ ప్రెస్ క్లబ్‌లో థరూర్ మీడియాతో మాట్లాడారు. 'పాక్‌పై భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉందని అమెరికా అర్థం చేసుకుందని నేను భావిస్తున్నా. పాక్‌తో భారత్ చర్చలు జరపదని కాదు. తలపై తుపాకీ గురిపెట్టి మాట్లాడే వ్యక్తులతో మేము సంభాషించం. అమెరికా అధ్యక్ష పదవిపై భారత దేశానికి అపారమైన గౌరవం ఉంది. కానీ దిల్లీ ఎప్పుడూ ప్రత్యేకంగా ఆపరేషన్ సిందూర్ విషయంలో ఎవరినీ మధ్యవర్తిత్వం చేయాలని కోరలేదు. ఎవరూ యుద్ధం ఆపాలని చెప్పాల్సిన అవసరం లేదు. పాక్ ఉగ్రవాద భాషను ఉపయోగించినంత కాలం.. మేము బల ప్రయోగ భాషను ఉపయోగిస్తాం.



తరువాయి 2లో

# ఉద్యోగులకు రెండు డీఏలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మంత్రిమండలి శుభవార్త చెప్పింది. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో రెండింటిని చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య ట్రస్టు ఏర్పాటు చేయడానికి నిర్ణయంతీసుకుంది. ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున ఉద్యోగుల బకాయిలు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. స్వయం సహాయక బృందాల్లోని సభ్యులు చనిపోతే.. వారి కుటుంబాలకు నేరుగా ప్రభుత్వమే రూ.10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. కొత్తగా 86.1 కి.మీ. మేర మూడు మార్గాల్లో మెట్రో నిర్మాణాన్ని రూ.19,579 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సుమారు ఐదున్నర గంటల పాటు క్యాబినెట్ సమావేశం జరిగింది. స్వల్ప అస్వస్థత కారణంగా అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఈ సమావేశానికి హాజరు కాలేదు. మిగిలిన మంత్రులందరూ పాల్గొన్నారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. త్వరలో మరోసారి మంత్రివర్గం సమావేశమవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. క్యాబినెట్‌లో మొత్తం 70కి పైగా అంశాలపై చర్చించారు. (Telangana News)

''మంత్రి మండలి సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నాం. ఉద్యోగులను సొంత బిడ్డలుగా పరిగణిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు, మంత్రిమండలికి ధన్యవాదాలు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించి అందులోని అంశాలకు ఆమోదం తెలిపాం. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కష్టపడుతున్న ఉద్యోగుల యోగక్షేమాల కోసం, అవసరాలు తీర్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. డీఏ కోసం ఉద్యోగ సంఘాలు ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తన నివేదికను సమర్పించింది. ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించింది. మరికొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది. ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని లెక్కలు కట్టి ప్రస్తుతానికి రెండు డీఏలు చెల్లించాలని నిర్ణయించాం. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒక డీఏను వెంటనే చెల్లిస్తాం. అప్పటి నుంచి బకాయి ఉన్న ఎరియర్స్‌ను 28 వాయిదాల్లో ఇస్తాం. మరో డీఏను ఆర్నెల్ల తర్వాత చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం వారు నెలకు రూ.500 చొప్పున చందా చెల్లిస్తే.. దానికి సమాన వాటాను ప్రభుత్వం చెల్లించి.. ఆ మొత్తంతో ఆరోగ్య ట్రస్టును ఏర్పాటు చేస్తాం. ఈ ట్రస్ట్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా అధికారులు, ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. ఆరోగ్యపరమైన సమస్యలను ఈ ట్రస్టు ద్వారా పరిష్కరించే వెసులుబాటు కల్పిస్తాం.

*** ప్రాధాన్యక్రమంలో బకాయిల చెల్లింపు**

ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల బకాయిలు గత ప్రభుత్వం నుంచి మాకు వారసత్వంగా వచ్చాయి. ఈ బిల్లులను ప్రాధాన్యక్రమంలో ప్రతి నెలా రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తాం. సచివాలయంలో ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కోటా 12.5 శాతానికి, ఉద్యోగుల మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇక నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోకూడదన్న ప్రతిపాదనకు మంత్రిమండలి అంగీకరించింది. గ్రామపంచాయతీల గ్రేడింగ్ ప్రకారం కార్యదర్శులకు గ్రేడింగ్ ఇవ్వనున్నాం. డీపీసీ రెగ్యులర్‌గా నిర్వహించి, పదోన్నతులు వచ్చేలా నిర్ణయాలు చేశాం. ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను వెనక్కు తీసుకురావడంతో పాటు కారుణ్య నియామకాలన్నీ వేగంగా పూర్తిచేస్తాం. కొత్తగా నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు మంత్రి మండలి నిర్ణయించింది. అంగన్‌వాడీలకు పదవీ విరమణ ప్రయోజనాలు పెంచేందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. వారి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను రూ.2 లక్షలకు పెంచాలని తీర్మానించింది. ఉద్యోగుల అద్దె వాహనాల బిల్లులు వెంటనే చెల్లించడంతో పాటు అద్దె పెంచే విషయమై సానుకూలంగా నిర్ణయం తీసుకున్నాం. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించడానికి ప్రభుత్వం అంగీకరించింది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయించింది.

*** బీమా కింద రూ.38.5 కోట్లకు ఆమోదం**

భద్రాద్రి కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు మంత్రి మండలి తీర్మానం చేసింది. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తు చనిపోతే, వారికి రూ.10 లక్షల బీమా ఇచ్చే కార్యక్రమం ఉండేది. ఇకపై ఇన్సూరెన్స్ ద్వారా కాకుండా.. వారికి ప్రభుత్వమే నేరుగా రూ.10 లక్షలు చెల్లించాలని నిర్ణయించాం. గత ఏడాది 385 మంది చనిపోయారు. వారికి రూ.38.5 కోట్ల నిధులు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదించింది. ఈ విధానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. గతంలో పాలకులు వారి ఫాంహౌస్‌లకు అనుకూలంగా రోడ్లు వేసుకున్నారు. మా ప్రభుత్వం ప్రతి గ్రామంలో రోడ్లు, గ్రామాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు నిర్మించనున్నాం. ఆర్ అండ్ బీ కింద 5,190 కి.మీ, పంచాయతీరాజ్

# పొగాకు, మామిడి, కోకో రైతులకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

పొగాకు, మామిడి, కోకో పంటలకు గిట్టుబాటు ధరలపై గురువారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు విలేకరులకు వివరించారు. గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.550కోట్ల వరకు భారం పడుతుందన్నారు.

**సీఎం సమీక్షలోని ప్రధానాంశాలు**

హెచ్‌డీ బర్లీ పొగాకును ఐటీసీ, జీపీఐ సంస్థలు కలిపి 25 మిలియన్ కిలోలు, చిన్న కంపెనీలు 20 మిలియన్ కిలోల చొప్పున కొనాలి. రెండు, మూడు గ్రేడ్ల రకాలు కొనేలా కంపెనీలతో మాట్లాడాలి. ప్రధాన రకాన్ని క్వింటాలుకు రూ.12 వేలకు తగ్గకుండా సేకరించాలి. మిగతా రెండు రకాలకు పరిస్థితులను బట్టి ధర నిర్ణయిస్తాం. ఈ పొగాకు కొనుగోళ్లతో ప్రభుత్వంపై రూ.300350 కోట్ల భారం పడనుంది. ఈ ఏడాది చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 5.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి వచ్చింది. ఇదంతా ప్రాసెసింగ్ రకం. ఇప్పటికే ప్రాసెసింగ్ సంస్థల వద్ద 43 వేల టన్నుల మామిడి గుజ్జు నిల్వలున్నాయి. పార్లే ఆగ్రో, కోకకోలా, పెప్సికో సంస్థల నుంచి ఆర్డర్లు రాకపోవడమే సమస్యకు కారణం. రైతులు, ట్రేడింగ్ కంపెనీలు, ప్రాసెసర్లను రిజిస్టర్ చేయాలి. రికార్డులు నిర్వహించాలి. కంపెనీలు కిలోకు రూ.8 ఇస్తే, ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా కిలోకు రూ.4 చొప్పున జమ చేస్తుంది. ఇందుకు రూ.100150 కోట్ల వరకు భరించనుంది.

- * రైతుల నుంచి ఇప్పటికే 465 టన్నుల కోకో కొనుగోలు చేశారు. ఇంకా 745 టన్నుల నిల్వలు రైతుల వద్దే ఉన్నాయి. కనీసం కిలోకు రూ.500 దక్కేలా చేసేందుకు ప్రభుత్వం కిలోకు రూ.50 చొప్పున చెల్లించనుంది. మొత్తం రూ.10.50 కోట్లు ఖర్చవుతుంది.
- * రాష్ట్రంలో కోకో పాలసీ తీసుకురావాలి. నాణ్యత కలిగిన ఉత్పత్తులు వచ్చేలా రైతుల్ని చైతన్యపరచాలి.
- * రైతుబజార్లను 116 నుంచి 200కు పెంచాలి. మొబైల్ మార్కెట్లు తీసుకురావాలి.
- * పీఎం కిసాన్ డేటాకు అనుగుణంగా అన్నదాతా సుఖీభవ లబ్ధిదారుల జాబితా రూపొందించాలి.
- * పామోలిన్‌పై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రైతులు ఎలా నష్టపోతున్నారో కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. నిర్ణయం వెనక్కి తీసుకునేలా కేంద్రాన్ని ఒప్పించే బాధ్యతను కేంద్ర మంత్రులు, ఎంపీలు తీసుకోవాలి.
- * ధరలు లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల్ని మళ్లించే బాధ్యత వ్యవసాయ శాఖదే.

# తలపై తుపాకీ గురిపెట్టిన పాక్‌తో చర్చలుండవ్

(మొదటిపేజీ తరువాయి)

కాల్పుల విరమణ కోసం మూడో పక్షం మధ్యవర్తిత్వం అవసరం లేదు' అని థరూర్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ నేత బిలావల్ భుట్టో అమెరికాలో శాంతి వచనాలు పలకడంపై భాజపా ఎంపీ తేజస్వీ సూర్య అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి నోటి నుంచి శాంతి వచనాలు రావడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని ఎద్దేవా చేశారు. థరూర్‌తోపాటు ఆయన మీడియాతో మాట్లాడారు. 'నకిలీ హీరోలను తయారు చేసేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. యుద్ధంలో విఫలమైన వారికి ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించింది. వారికి నిజమైన హీరోలు ఎలా ఉంటారో తెలియదు. చైనాకు చెందిన చౌకైనా ఆయుధాలతో పాక్ నెట్టుకొస్తోంది. కాబట్టి మా దేశంలోని అత్యాధునిక ఆయుధాలు, మా బలగాలు, బలమైన ప్రజాస్వామ్య నాయకత్వాన్ని జీర్ణించుకోవడం వారికి కష్టమే' అని సూర్య పేర్కొన్నారు.

**జేడీ వాన్స్‌తో భేటీ**

అమెరికాలో పర్యటిస్తున్న భారత ప్రతినిధి బృందం.. గురువారం ఉపాధ్యక్షుడు జేడా వాన్స్‌తో భేటీ అయింది. ఆయనతో సమగ్ర చర్చలు జరిపింది. ఉగ్రవాదం, సాంకేతిక సహకారంపై వారి మధ్య చర్చలు జరిగాయి. అంతకుముందు బుధవారం క్యాపిటల్ హిల్‌లో పలువురు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు, సెనేటర్లను భారత ప్రతినిధి బృందం కలిసింది. వారంతా ఉగ్రవాదంపై భారత పోరాటానికి సంఘీభావం తెలిపారని థరూర్ వెల్లడించారు. నీ భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం.. బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో ఐరోపా కూటమి (ఈయూ) నేతలతో భేటీ అయింది. యూరోపియన్ పార్లమెంటు ఆసియా ఇన్‌ఛార్జ్ ఉపాధ్యక్షుడు క్రిస్టెల్ షాల్డెమోస్‌ను కలిసిన బృందం.. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ తీరు గురించి వివరించారు. ఈయూ పార్లమెంటు సభ్యులు, ప్రవాస భారతీయులతోనూ బృందం భేటీ అయింది.

*** జాతీయ ప్రయోజనాల కోసం పని చేయడం పార్టీకి వ్యతిరేకమా?**

జాతీయ ప్రయోజనాల కోసం పని చేయడం పార్టీకి వ్యతిరేకమన్నవారు.. వారిని వారే ప్రశ్నించుకోవాలని శశి థరూర్ స్పష్టం చేశారు. దేశం కోసం పని చేస్తున్నవారు ఇటువంటి విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. విదేశాలకు వెళ్లిన అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహించే విషయంలో తమను సంప్రదించనందుకు కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు పార్టీ నేతలు విమర్శించిన నేపథ్యంలో ఆయన ఇలా స్పందించారు.

*** కుమారుడి ప్రశ్న.. తండ్రి సమాధానం**

కచ్చితమైన సాక్ష్యాలు లేకుండా భారత్ దాడులు చేయదని శశి థరూర్ స్పష్టం చేశారు. విదేశీ వ్యవహారాల కౌన్సిల్‌లో జరిగిన ముఖాముఖిలో ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు. అయితే థరూర్‌కు ఈ ప్రశ్న వేసింది ఆయన కుమారుడే కావడం విశేషం. థరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ వాషింగ్టన్ పోస్టులో కాలమిస్టుగా ఉన్నారు. 'మీరు పలు దేశాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మీతో సంభాషించిన వారెవరైనా.. ఉగ్ర దాడుల్లో పాకిస్థాన్ హస్తం ఉందనడానికి ఆధారాలను చూపాలని కోరారా.. దీంతోపాటు పదే పదే పాక్ మీ ఆరోపణలను తిరస్కరించడంపై మీరేమంటారు' అని ఇషాన్ ప్రశ్నించారు. దీనిపై శశి థరూర్ నవ్వుతూ స్పందించారు. 'ఇషాన్.. నువ్వు ఈ ప్రశ్న లేవనెత్తడం పట్ల సంతోషిస్తున్నా. దీనిని నేను ప్లాన్ చేయలేదు సుమా.. ఇషానే వాళ్ల నాన్నకు అడిగారు. మమ్మల్ని ఎవరూ ఆధారాలు కావాలని అడగలేదు. కానీ మీడియానే అడిగింది. మీ మీడియా తరపున అడుగుతున్నావు. ఇంకో రెండు మూడు చోట్ల ఈ ప్రశ్న ఎదురైంది. అయితే కచ్చితమైన ఆధారాల్లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ దాడి చేయదు' అని శశి థరూర్ స్పష్టం చేశారు.

# 'సీమ'కు పారిశ్రామిక హంగు

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వాటి ఆధారంగా సుమారు 1,26,519 మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని అంచనా. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చి సరిపెట్టకుండా.. నిర్దేశిత వ్యవధిలో వాటిని పూర్తిచేసేలా పర్యవేక్షించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది.

**ఇక వెలుగుల సీమ**

సీమ 'విద్యుత్ పుంత' కాబోతోంది. 27 భారీ సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టులు (పీఎస్‌పీ), బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. 16వేల మెగావాట్లకు పైగా విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. వాటిద్వారా రూ.లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు సీమ జిల్లాకు రాబోతున్నాయి. అవన్నీ పూర్తయితే విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల హబ్‌గా మారుతుంది.

**నడవాలకు.. పారిశ్రామిక కళ**

హైదరాబాద్‌బెంగళూరు పారిశ్రామిక నడవాలో ఓర్వకల్లు నోడ్‌ను రూ.2786.10 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. ఇక్కడి పరిశ్రమల నీటి అవసరాలు తీర్చేందుకు రూ.200 కోట్లతో 57 కి.మీ. పైపులైన్ ఏర్పాటుచేస్తోంది. ఓర్వకల్లులో జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రోటెక్నాలజీ కార్పొరేషన్, మన దేశానికి చెందిన హైడ్రెస్ గ్రూప్, బీఎన్ గ్రూప్‌లు సంయుక్తంగా రూ.14వేల కోట్లతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను నెలకొల్పనున్నాయి. దీనిద్వారా 2వేల మందికి ఉపాధి లభించనుంది. ఓర్వకల్లులో పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ 1200ఎకరాల్లో రూ.13వేల కోట్ల పెట్టుబడితో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలో తొలి 'సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు'(ఐ.ఆర్.ఇ.పి.)ను రూ.24 వేల కోట్లతో గ్రీన్‌కో సంస్థ కర్నూలులో ఏర్పాటుచేస్తోంది. సౌర, పవన, పీఎస్‌పీ ప్రాజెక్టుల ద్వారా 6వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి వస్తుంది. విశాఖచెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తి నోడ్‌ను రూ.2137 కోట్లతో అభివృద్ధి చేస్తారు.

# ఆర్కైవ్స్‌పై విజిలెన్స్

(మొదటిపేజీ తరువాయి)

బయటికి తీసుకురావడం, ఆ స్థానంలో నకిలీ పత్రాలను చొప్పించడంతోపాటు అవే అసలైనవంటూ రాజముద్ర వేసి మరీ ఇస్తూ భూఆక్రమణలకు, న్యాయవివాదాలకు కొందరు కారణమవుతున్న వైనంపై 'ఆర్కైవ్స్‌లో దొంగలు పడ్డారు!' శీర్షికన ఈ నెల 4న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం కలకలం సృష్టించింది. హైదరాబాద్ శివార్లలోని విలువైన భూములను కొల్లగొట్టేందుకు కొన్ని ముఠాలు పన్నిన పన్నాగాలను ఆధార సహితంగా కథనంలో ప్రస్తావించిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందం గురువారం ఉదయం 10 గంటలకే విచారణ ఆరంభించింది. ఆర్కైవ్స్ కార్యాలయం ప్రధాన ద్వారాన్ని మూసివేసి..పలువురు అధికారులు, సిబ్బంది వాంగ్మూలాలను సేకరించింది. సాయంత్రం పొద్దుపోయే వరకూ విచారణ కొనసాగింది.

**నకిలీ దస్త్రాల సేకరణలో నిమగ్నం**

పురాతన కాలం నాటి భూదస్త్రాలకు నిలయమైన ఆర్కైవ్స్ విభాగంలో నకిలీ దస్త్రాల దందాపై విజిలెన్స్ బృందం ప్రధానంగా దృష్టిసారించింది. ఆ విభాగంలోని సిబ్బంది సహకారంతో భూకబ్జాదారులు నకిలీ రికార్డులు సృష్టించిన అంశంపై కూపీ లాగుతోంది. ఇప్పటికే రాయదుర్గంలో 83 ఎకరాలు, మంచిరేవులలో 76 ఎకరాలు, యాచారంలో 10 ఎకరాల భూములకు సంబంధించి నకిలీ దస్త్రాలు సృష్టించినట్లు బహిర్గతం కావడంతో ఆయా రికార్డులను సేకరించడంలో నిమగ్నమైంది. నకిలీ దస్త్రాలు సృష్టించడంలో కీలకపాత్ర పోషించింది ఎవరు, వాటిని ఆర్కైవ్స్‌లోని సంబంధిత విభాగంలోకి ఎవరు చేర్చారు, అనంతరం స.హ.చట్టం దరఖాస్తు ద్వారా ఆ రికార్డులను ఎవరు పొందారు, దాని ఆధారంగా న్యాయవివాదం సృష్టించింది ఎవరు, ఈ ముఠాల వెనక ఉన్న సూత్రధారులెవరు, ఆయా ముఠాలకు సహకరించిన ఇంటిదొంగలు ఎందరున్నారు..తదితర వివరాలను సేకరించే దిశగా విజిలెన్స్ బృందం విచారణ కొనసాగిస్తోంది. ఆయా దస్త్రాలకు సంబంధించిన నోట్‌ఫైళ్లనూ పరిశీలిస్తోంది.

**కేసుల వివరాల కోసం లేఖలు**

నకిలీ దస్త్రాలపై ఇప్పటికే సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ, నార్సింగి ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా కేసుల తాలూకు వివరాలు ఇవ్వాలని కోరుతూ సంబంధిత ఠాణాలకు విజిలెన్స్ లేఖలు రాసింది.

# పుడమిని పరిరక్షించుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

''బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌తో భారత్ చేసిన యుద్ధంలో కచ్‌కు చెందిన వీరమహిళలు తమ పరాక్రమాలను ప్రదర్శించారు. ఇటీవల నేను గుజరాత్‌లో పర్యటించిన సమయంలో ఆ తల్లులు, సోదరీమణులు నన్ను కలిసి సిందూర మొక్కను బహుమతిగా ఇచ్చారు. ఈ రోజు ఆ మొక్కను ప్రధానమంత్రి నివాసంలో నాటే భాగ్యం నాకు లభించింది. ఈ మొక్క మన దేశ నారీశక్తి శౌర్యానికి, స్ఫూర్తికి ప్రతీక'' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పుడమిని రక్షించుకోవటానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని 'ఎక్స్' వేదికగా సూచించారు.

**ఆరావళి హరిత ప్రాజెక్టు ప్రారంభం**

దిల్లీ నుంచి గుజరాత్ వరకు 700 కి.మీ. మేర విస్తరించిన ఆరావళి పర్వత ప్రాంతాలను హరితమయం చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. గుజరాత్, రాజస్థాన్, హరియాణా, దిల్లీలను కలిపే ఆరావళి ప్రాంతం.. భూగోళం మీద పురాతనమైనవాటిలో ఒకటని 'ఎక్స్'లో పేర్కొన్నారు. దిల్లీలో విద్యుత్తు బస్సుల్ని ఆయన ప్రారంభించారు. భగవాన్ మహావీర్ వనస్థలి పార్కులో మొక్కను నాటారు.

# ఉగ్రవాదుల ఆవాసాలపై ఎన్ఐఏ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

వారికి అంతర్గతంగా మద్దతునిస్తున్న వారి నివాస ప్రాంగణాలపై దాడులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో ఆయుధాలు, నేరాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలను పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పుల్వామా, కుల్గాం, శోపియాన్, బారాముల్లా, కుప్వాడా జిల్లాల్లో పాకిస్థాన్ మద్దతుతో పనిచేస్తున్న ది రెసిస్టెంట్ ఫ్రంట్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ జమ్మూకశ్మీర్, ముజాహిద్దీన్ గజ్‌వాత్ ఉల్ హింద్, జమ్మూకశ్మీర్ ఫ్రీడమ్ ఫైటర్స్, కశ్మీర్ టైగర్స్ తదితర ఉగ్రసంస్థల కార్యకర్తలు, మద్దతుదారుల నివాసాలపై ఎన్ఐఏ దాడులు జరిపింది. ఇవన్నీ లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్, అల్ బదర్ వంటి నిషేధిత ఉగ్రసంస్థలకు అనుబంధ సంస్థలుగా కొనసాగుతూ వాటి కుట్రలను అమలుపరుస్తున్నాయని ఎన్ఐఏ ఆరోపించింది.

# నేను లేకుంటే ట్రంప్ ఓడిపోయేవారే: మస్క్

**ఆయన లేకున్నా గెలిచేవాడినే: డొనాల్డ్**



వాషింగ్టన్: తన మద్దతు లేకుంటే 2024 అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ నేతలు ఓటమి పాలయ్యేవారని టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. 'నేను లేకుంటే ట్రంప్ ఓడిపోయేవారు. ప్రతినిధుల సభపై డెమొక్రాట్లు ఆధిక్యం సాధించేవారు. సెనెట్‌లో రిపబ్లికన్లు 5149తో ఉండేవారు' అని ఆయన గురువారం స్పష్టం చేశారు. రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడంతో తాను అసంతృప్తికి గురయ్యానని, శ్వేతసౌధంలో తన స్నేహితుడు లేకపోవడం విచారకరమని ట్రంప్ అంతకుముందు వ్యాఖ్యానించారు. తాను ఎన్నికల్లో విజయం సాధించడానికి మస్క్ అవసరం లేదని స్పష్టం చేశారు. మస్క్ లేకుండానే పెన్సిల్వేనియాలో తాను గెలిచేవాడినని తెలిపారు. మస్క్ వ్యాపారాలకు ఉపయోగపడే ప్రభుత్వ కాంట్రాక్టులకు, రాయితీలకు కోత వేస్తానని ట్రంప్ హెచ్చరించారు. అదే సమయంలో మస్క్ వరుసగా ఎక్స్‌లో స్పందించారు. కొత్త పార్టీ పెట్టవచ్చా అని అభిమానులను ప్రశ్నించారు. '80శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా అమెరికాలో కొత్త పార్టీ పెట్టడానికి ఇది సమయమేనా..' అని అడిగారు.

# వృద్ధుని కిడ్నాప్ చేసిన ముగ్గురు అరెస్ట్

* రిమాండ్‌కు తరలింపు
* పరారీలో మరో నిందితుడు
* వివరాలను వెల్లడిరచిన ఎస్ఐ సిహెచ్.గణేష్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: వృద్ధున్ని కిడ్నాప్ చేసిన ముగ్గురిని ముస్తాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ సిహెచ్.గణేష్ అరెస్ట్ వివరాలను వెల్లడిరచారు. గూడూరు గ్రామానికి చెందిన జంపల్లి మల్లయ్య అనే 72 సంవత్సరాల వృద్ధుడు ఈ నెల 2 నుంచి కనబడటం లేదని అతని భార్య జంపల్లి మల్లవ్వ ఈ నెల 3న ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ




తెలిపారు. వృద్ధుని ఆచూకీ కోసం ఇద్దరు కానిస్టేబుల్స్ రాజశేకర్, ఖాసీంలతో సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా 24గంటల్లో మల్లయ్యను కోరుట్లలో గుర్తించి తీసుకు వచ్చిన్నట్లు తెలిపారు. అనంతరం విచారించగా, అతని కొడుకు పర్శరాం స్నేహితుడైన మల్కపేటకు చెందిన బోయిని రాజేందర్ వద్ద తన కొడుకు 30లక్షలు తీసుకొని ఇవ్వడం లేదని, దీంతో ఈ నెల 2న రాజేందర్ తన స్నేహితులైన కలకోట రవి, సందడికారి సతీష్, కారు డ్రైవర్ సుమంత్‌లతో కలిసి కిడ్నాప్ చేసి కొట్టి డబ్బులు ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించి, కారులో తీసుకు వెళ్లి, కోరుట్లలో ఓ రూంలో బెదిరించారని తెలిపారు. దీంతో కిడ్నాప్ చేసిన ముగ్గురి బోయిని రాజేందర్, కలకోట రవి, సందడికారి సతీష్‌లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మరో నేరస్థుడు సుమంత్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

## మున్సిపాలిటీలో వార్డ్ విభజనపై అభ్యంతరం

* అఖిలపక్ష సమావేశం నిర్వహణకు డిమాండ్



గుమ్మడిదల,ప్రజాస్ఫూర్తి 05: గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం గ్రామాలను కలిపి ఇటీవల ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో, వార్డ్ విభజన సక్రమంగా జరగలేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.మాజీ జడ్పిటిసి సభ్యుడు కుమార్ గౌడ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల పరంగా సరైన వార్డ్ విభజన జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి గ్రామానికి సంబంధిత వార్డులను, గ్రామాలను వరుస పద్ధతిలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.వార్డ్ విభజనపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలను పిలిచి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు, యాదవ్ కుంటి మల్లేష్, రఘు గౌడ్, కుంటి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

* టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. మీడియా లెవన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన జవాన్ కప్ క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. నిర్వహకులు క్రీడాకారులను ఆయనకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతు క్రికెట్ పోటీల నిర్వహణ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆర్మీ కు విరాళంగా ఇవ్వాలనే నిర్వాహకుల ఆలోచన చాలా మంచి నిర్ణయమని, ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, న్యాయవాది యెర్రా కామేష్, బొబ్బాల.వెంకట్ యాదవ్ , జర్నలిస్టులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ వాసులకు అలర్ట్.. మళ్లీ షురూ అయిన వర్షం

హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండ మండిపోగా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షం మొదలైంది. నిజాంపేట్, KPHB, మియాపూర్, బాలానగర్, చింతల్, బోయిన్‌పల్లి, ప్రగతినగర్ ఏరియాల్లో వర్షం పడుతోంది. కొన్ని గంటల్లో మరికొన్ని ప్రాంతాలకు ఈ వర్షం విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షం కారణంగా రోడ్లపైకి వరదనీరు చేరింది. దీంతో అక్కడక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీ సులు, హైడ్రా, జీహెచ్ఎంసీ బృందాలు రంగంలోకి దిగాయి.






## ఎంపీ ఆర్ఆర్ఆర్ ఏడాది పాలనపై సంబరాలు

* ఆటో డ్రైవర్ లకు ఖాకీ చొక్కాల పంపిణీ

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఎంపీ రామ సహాయం రఘు రాంరెడ్డి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు ఎన్నికై ఏడాది అయిన సందర్భంగా కొత్తగూడెం విద్యానగర్ లోని రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, జేవిఎస్ చౌదరి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న తదితరులు హాజరై కేక్ కట్ చేసి ఎంపీ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు ఎంపీ ఏడాది పాలన గురించి మాట్లాడుతు రామ సహాయం రఘు రాంరెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకి భరోసా కల్పిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్నారని, ప్రత్యేకంగా కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం తపిస్తూ కొత్తగూడెం విమానశ్రయం ఏర్పాటుపై కేంద్ర మంత్రిపై ఒత్తిడి తెచ్చి ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందంతో సర్వే జరిగేలా చేశారన్నారు. ఎప్పటి నుండో పెండింగ్ లో ఉన్న రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులకు మోక్షం కలిగించడంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేశారని, ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎంపీ ఆర్ఆర్ఆర్ రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తూ మరింత పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో టెలికాం కమిటీ సభ్యులు కనకరాజు, రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఐఎన్టీయూసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, మాజీ కౌన్సిలర్ తలుగు అనిల్, కాంగ్రెస్ నాయకులు సుందర్ లాల్ కోరి, ఆకుల సుధాకర్, జానీ, గొల్ల శీను, కే కే శ్రీను, సుందర్ రాజ్, మహిళ నేతలు జోగు రమాదేవి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్ ను ఉత్తమ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు కృషి

* ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : రాబోయే రోజుల్లో నాచారం డివిజన్ ను ఉత్తమ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరానగర్ వీధి నెంబర్ పదకొండు , పన్నెండు లల్లో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.25 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది. అట్టి పనులను గురువారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాచారం డివిజన్లోని సాయి నగర్లో మిగిలి ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో నాచారం డివిజన్లో ఏలాంటి భూగర్భ డ్రైనేజీ సమస్యలు కానీ సిమెంట్ రోడ్ల సమస్యలు లేకుండా డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ కీర్తి , వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్ జలమండలి సిబ్బంది, బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు ఇందిరానగర్ వాసులు , సాయి నగర్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి బడిబాట...

* బడిబాట - ముందస్తు ప్రణాళిక




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నేటి నుంచి నిర్వహించబడనున్న బడిబాట కార్యక్రమాలను తేదివారీగా ప్రభుత్వం సూచించిన రీతిలో విధిగా నిర్వహించాలనీ రోజువారీ నివేదికలను మండల డెస్క్ నకు పంపాలని కొత్తగూడెం మండల విద్యాశాఖాధికారి డా . ప్రభుదయాల్ ఆదేశించారు. యం ఆర్ సి కార్యాలయంలో గురువారం సకల పాఠశాలల బాధ్యులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. మొదట జిల్లా కలెక్టర్ స్ఫూర్తితో కొత్తగూడెం మండలంలో గల అన్ని పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే రీతిలో బడిబాట ను విజయవంతం చేయాలని కోరారు. 6 న గ్రామసభ నిర్వహించి పాఠశాల పనితీరు, ప్రభుత్వం కల్పిస్తున్న సకల సౌకర్యాల గురించి వివరించాలన్నారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో గల బడి ఈడు గల పిల్లలంతా వందశాతం బడుల్లో చేరేలా ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రోజువారీ ఆయా కార్యక్రమాలను తూచా తప్పకుండా ఆచరించలన్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో సకల హెచ్ఎం లు, సి ఆర్ లు, ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.



## త్రివర్ణం చాటున సప్తవర్ణం..

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణంలో గురువారం సాయంత్రం త్రివర్ణ పతాకం చాటున సప్తవర్ణాల ఇంద్రధనస్సు ఆవిష్కృతమైంది. పగలంతా భానుడి భగభగలతో అల్లాడిన కొత్తగూడెం పట్టణం... సాయంత్రం వేళలో వాతావరణ మార్పుతో చిరుజల్లులకు తడిసి ముద్దయింది. ఒకవైపు ఎండ.. మరోవైపు వాన వల్ల ఆకాశంలో ఇంధ్రధనస్సు కన్పించింది. కొత్తగూడెం పట్టణం ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న జవాన్ కప్ క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ జెండా చాటున ఇంద్రధనుస్సు కనువిందు చేయగా ఆ దృశ్యాలను ప్రజాస్ఫూర్తి కెమెరా క్లిక్ కనిపించింది.

## సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన కమిషనర్ సుదీర్ బాబు



ప్రజాస్ఫూర్తి, యాదగిరిగుట్ట.గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుదీర్ బాబు శుక్రవారం తిరుమలాపూర్ తుర్కపల్లి మండలంలో జరగనున్న సీఎం బహిరంగ సభ నేపథ్యంలో సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం సభ స్థలి ఏర్పాట్లు, భద్రత చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ మొదలైన అంశాలపై అధికారులు , సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు. అనంతరం గూడూరు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు ను సందర్శించి అధికారులకు తగు సూచనలు చేశారు.

## డీఈఈ సెట్ ఫలితాలు విడుదల

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యు కేషన్, డిప్లోమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రవేశాల కోసం నిర్వహించిన డీఈఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ప్రవేశ పరీక్షకు 33,321 మంది హాజరయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల ప్రకారం, 28,448 మంది క్వాలిఫై అయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల(జూన్) 9 నుంచి 13 వరకు రాష్ట్రంలోని 10 డైట్ కాలేజీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. జూన్ 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకువచ్చు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా డైట్ కాలేజీల్లో 4000 వరకు సీట్లు అందుబాటులో ఉన్నట్లు సమాచారం. ఫలితాల కోసం ఈ లింక్ https://deecet.cdse.telangana.gov.in/ పై క్లిక్ చేయండి.

## రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడి మృతి.. డీజీపీకి ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్: నగరంలోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో యువకుడి మృతిపై జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించింది. రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పోలీసుల వేధింపులు కారణంగానే యువకుడు మృతి చెందినట్టు మీడియాలో వచ్చిన కథనాలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్ఆర్‌సీ ఈమేరకు డీజీపీకి నోటీసులు జారీ చేసింది.



# 'ట్రావెల్ బ్యాగు'లో మహిళ మృతదేహం.. నిందితుడిని గుర్తించిన పోలీసులు

హైదరాబాద్: నగర శివారులోని బాచుపల్లిలో ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. మృతదేహాన్ని నేపాల్‌కు చెందిన యువతిగా గుర్తించారు. నేపాల్‌కు చెందిన విజయ్ అనే వ్యక్తి మే 23న యువతిని హత్య చేసి మృతదేహాన్ని ట్రావెల్ బ్యాగ్‌లో పెట్టి బాచుపల్లి మియాపూర్ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కేపీహెచ్‌బీలో నిందితుడు సూట్ కేస్ కొనుగోలు చేసినట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు.

**ఏం జరిగిందంటే?**

హైదరాబాద్ శివారులోని బాచుపల్లి మియాపూర్ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బుధవారం ఉదయం ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం కలకలం రేపింది. బాచుపల్లి రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కంపెనీ పక్కన విజయదుర్గా ఓనర్స్ అసోసియేషన్ కాలనీ లేఅవుట్ ఉంది. అందులో నివాసాలు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడ రెండు రోజులుగా దుర్వాసన వస్తుండటాన్ని వాహనదారులు గుర్తించారు. బుధవారం సమస్య మరింత పెరగడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పెద్ద ట్రావెల్ బ్యాగును తెరిచి చూడగా 2535 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతదేహం కనిపించింది. మెడలో మంచానికి ఉపయోగించే నవారు ఉండటాన్ని గమనించి ఆమెను హత్య చేసి ఉంటారని, ఎక్కడో వేరే ప్రదేశంలో హతమార్చి ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉంటారని భావించారు. ఒంటిపై ఎరుపు రంగు పంజాబీ దుస్తులు, చేతికి మట్టి గాజులు ఉన్నాయి. మృతదేహం తీరును బట్టి వారం నుంచి పది రోజుల క్రితం చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించడంతో పోలీసులు నాలుగు బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు.




## పెళ్లి బృందం కారును ఢీకొట్టిన డీసీఎం వాహనం.. చిన్నారి మృతి, వరుడికి గాయాలు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందం కారును డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 3 నెలల చిన్నారి రుద్ర మృతిచెందగా.. వరుడు సహా ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి నాందేడ్ నుంచి హుజూరాబాద్‌కు పెళ్లి బృందం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వరుడు గాయపడటంతో వివాహం ఆగిపోయింది. గాయపడిన వారు చికిత్స అనంతరం తిరిగి నాందేడ్ వెళ్లిపోయారు.



**గాయపడిన వారు**

మహేశ్ (వరుడు), వాగ్మేర సితాల్, వాగ్మేర మారుబాయి, వాగ్మేర దినేశ్, వాగ్మేర సోనాలి, డ్రైవర్ గణేశ్

# ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై చర్చ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై కేబినెట్‌లో ప్రధానంగా చర్చిస్తున్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణపై కూడా చర్చ చేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగుల సమస్యలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉద్యోగులు సమస్యలు, రైతు భరోసా స్కీమ్ నిధుల విడుదల తేదీపై క్లారిటీ, బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై చర్చ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలానే పెండింగ్ డీఏ విడుదల అంశంలో కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఇచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే బుధవారం నాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో వారు అనేక అంశాలపై చర్చించారు. దీంతో నేటి కేబినెట్ భేటీ తర్వాత ఉద్యోగులకు సంబంధించి ఒకటి లేదా రెండు పెండింగ్ డీఏలపై ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. వీటితో పాటుగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భూభారతి చట్టం అమలు, భూదాన్ భూముల వ్యవహారంతో పాటు పలు పెండింగ్ ప్రాజెక్ట్‌ల గురించి కేబినెట్ భేటీలో చర్చ చేస్తున్నట్లు సమాచారం.





## దక్షిణకోస్తా రైల్వే జీఎంగా సందీప్ మాథుర్

దిల్లీ: విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జీఎంగా సందీప్ మాథుర్‌ను రైల్వే బోర్డు నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం సందీప్ మాథుర్ దిల్లీ రైల్వే సిగ్నల్ ఆధునికీకరణ ప్రాజెక్టు సారథిగా వ్యవహరిస్తున్నారు. విశాఖ రైల్వేజోన్‌పై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వచ్చేలా చూస్తామని విశాఖ ఎంపీ భరత్ తెలిపారు. వాల్తేర్ డివిజన్‌తో విశాఖ రైల్వే జోన్ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే జోన్ పనులు వేగవంతమయ్యేందుకు ఇది కీలక చర్య అని పేర్కొన్నారు.

## కాళేశ్వరం కమిషన్ ముందుకు

# కేసీఆర్, ఈటల రాజేందర్, హరీష్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత నియంత్రణ, ఆర్థిక వ్యవహారాలపై కమిషన్ దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు సమయంలో మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్ రావులు కీలక పాత్రలు పోషించారు. వీరి ఇద్దరితో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈటల రాజేందర్ జూన్ 6న, హరీష్ రావు జూన్ 9న, కేసీఆర్ జూన్ 11న విచారణకు హాజరు కావాలని కమిషన్ ఆదేశించింది. కమిషన్ ఇప్పటికే 200 మంది అధికారులను, 25 మంది ఐఏఎస్ అధికారులను విచారించి... బ్యారేజీల నిర్మాణ సంస్థలు, ఇంజనీర్లు, కాగ్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను పరిశీలించింది. అధికారులు తమ వాంగ్మూలంలో కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో వీరి ముగ్గురి వాదనలు కూడా పరిగణలోకి తీసుకోవడానికి కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ విచారణలో బీఆర్ఎస్ నేతల వాంగ్మూలాలు రాజకీయంగా కీలకం కానున్నాయి, జూన్ 30 నాటికి కమిషన్ తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## మంత్రి కొండా సురేఖకు స్వల్ప అస్వస్థత

విరామం లేకుండా విస్తృతంగా కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే మంత్రి కొండా సురేఖ స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారని వైద్యులు స్పష్టం చేశారు. గురువారం మంత్రి కొండా సురేఖ సచివాలయంలో అస్వస్థతకు గురి అయ్యారు. విషయం తెలుసుకున్న వైద్యులు మంత్రికి అక్కడే ప్రథమ చికిత్స నిర్వహించారు. గత కొద్ది రోజులుగా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో విరామం లేకుండా వివిధ కార్యక్రమాలకు హాజరుకావడం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాదు పీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రాంలో పాల్గొనడం, అటు తర్వాత సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరు అయ్యేందుకు అవసరమైన డేటాను అధికారుల నుంచి సేకరిస్తున్న నేపథ్యంలో సకాలంలో ఆహారం తీసుకోలేక పోవడంతో మంత్రి అస్వస్థతకు గురి అయ్యారని వైద్యులు పేర్కొన్నారు. అయితే, ఈ సంఘటన పై ఎటువంటి ఆందోళన అక్కర్లేదని, విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని అన్నారు. అస్వస్థతకు గురైన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకొని మంత్రి కొండా సురేఖను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సీఎం వైద్యులను ఆరా తీశారు. ఒకటి, రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటికి వెళ్ళి రెస్టు తీసుకోవాలని మంత్రి సురేఖకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తన ఆరోగ్యం పట్లా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గవాసులు, జిల్లాకు చెందిన వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సురేఖ ఉద్ఘాటించారు. గత కొన్ని రోజులు బిజిబిజి షెడ్యూల్ నేపథ్యంలో ఆహారం సకాలంలో తీసుకోకపోవడంతోనే ఇబ్బంది తలెత్తిందని సురేఖ చెప్పుకొచ్చారు.



# యుద్ధ ట్యాంకులో రక్షణ మంత్రి రైడ్..

మెదక్ జిల్లాకే తలమానికంగా నిలిచిన (ఓడిఎఫ్) ఆయుధ కర్మాగారానికి తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. గురువారం ఆయన కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం ఓడిఎఫ్ కర్మాగారంలో స్థానిక మెదక్ ఎంపీ రఘునందన్ రావు తో కలిసి పర్యటించారు. అందులో తయారు చేస్తున్న యుద్ధ ట్యాంకులో ఎక్కి తిరిగి వాటి పనితీరును పరిశీలించారు. అనంతరం మేనేజ్మెంట్ సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓడిఎఫ్ చేస్తున్న సేవలు గొప్పవని ప్రశంసించారు. దేశానికి ఇలాంటి కర్మగారాల సేవలు ఎంతో అవసరమని, అందుకు అవసరమైన తమ సంపూర్ణమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా సిబ్బందికి భరోసానిచ్చారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కర్మాగారం ఆవరణలో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎండీ సంజయ్ దివేది, జనరల్ మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## ధన్వాడ రైతులపై ప్రభుత్వ దౌర్జన్యం దారుణం: మాజీ మంత్రి

జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో రైతులపై ప్రభుత్వ దౌర్జన్యం దారుణమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇథనాల్ పరిశ్రమ స్థాపించమబోమని రైతులకు హామీ ఇచ్చి.. మళ్లీ అక్కడ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నించడం రైతులను, ప్రజలను మోసం చేయడమే అని తెలిపారు. ప్రభుత్వ మోసాన్ని ప్రశ్నించిన రైతులు, రైతు కుటుంబాలపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా.. 40 మంది రైతులను అదుపులోకి తీసుకుని.. 12 మందిపై కేసులు పెట్టి రిమాండుకు పంపడం దుర్మార్గమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యాలను ఎదిరిస్తామని.. భవిష్యత్తులో కాంగ్రెస్ కుటిల నీతికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. ఆర్సీబీ, కేఎస్‌సీఏపై కేసు నమోదు

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నేరపూరిత నిర్లక్ష్యం కేసులో ఈ సంస్థలను నిందితులుగా పేర్కొని భారతీయ న్యాయ సంహితలోని ఐదు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

**కేసు విచారణ సీఐడీ చేతికి..!**

మరోవైపు, ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కోర్టుకు ఇచ్చిన స్టేటస్ రిపోర్టులో ఈ విషయాన్ని ప్రభుత్వం పేర్కొంది. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తు చేస్తుందని తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేయాలన్న ఆదేశాలతో పాటు ఎఫ్ఐఆర్ కాపీని సీఐడీకి అప్పగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ విషాద ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరుపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాటకు కారణాలేంటి? తలెత్తిన



లోపాలు, జవాబుదారీతనం వంటి అంశాలను పరిశీలించేందుకు డిప్యూటీ కమిషనర్, బెంగళూరు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ 15 రోజుల్లోగా విచారణ చేస్తారని ప్రభుత్వం తెలిపింది. స్టేడియం వద్ద 2.5లక్షల మంది ప్రజలు గుమిగూడారని, బెంగళూరు నగర పోలీసుల నుంచి 1380 మంది సిబ్బంది, 13 కేఎస్ఆర్‌పీ ప్లాటూన్లు (325మంది సిబ్బంది)ని మోహరించి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. కానీ, జనం భారీగా తరలిరావడంతో పలు గేట్ల వద్ద తొక్కిసలాట జరిగి 11మంది మృతిచెందగా.. 56మంది గాయపడ్డారని తెలిపింది. 1, 6, 7, 1721 గేట్ల వద్ద ప్రాణనష్టం జరిగినట్లు పేర్కొంది. వైద్య సహాయం వెంటనే అందించామని.. క్షతగాత్రుల్లో 50మంది అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందగా, మరో ఆరుగురికి ఇంకా చికిత్స కొనసాగుతున్నట్లు పేర్కొంది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు మూడు అగ్నిమాపక వాహనాలు, రెండు అంబులెన్స్‌లు, రెండు డిశ్వాట్ యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్ వాహనం మోహరించినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నింటినీ భరించినట్లు తెలిపింది. అలాగే, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సైతం మృతులకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది.

# అలా చేయడం విద్యార్థిని మానసికంగా వేధించడమే: దిల్లీ హైకోర్టు



దిల్లీ: దేశ రాజధానిలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజు వసూలు విషయంలో యాజమాన్యం విద్యార్థుల పట్ల ప్రవర్తించిన తీరుపై అసహనం వ్యక్తం చేసింది. డబ్బు కోసం బహిరంగంగా విద్యార్థులను అవమానించడం సరికాదని పేర్కొంది. ద్వారకాలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం 30మందికి పైగా విద్యార్థుల పట్ల దారుణంగా ప్రవర్తించింది. వారి తల్లిదండ్రులు సమయానికి ఫీజు చెల్లించడంలో విఫలమయ్యారనే కారణంతో బహిరంగంగా వారిని అవమానించింది. విద్యార్థులను స్కూల్ జాబితాలో నుంచి తొలగించింది. వారిని స్కూల్‌కి రాకుండా చేసింది. అందుకోసం సిబ్బందిని కూడా నియమించింది. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. పాఠశాల యజమాన్య చర్యపై అసహనం వ్యక్తం చేసింది. ''కేవలం డబ్బు కోసం విద్యార్థుల పట్ల ఈ విధంగా ప్రవర్తించడం సరికాదు. ఫీజు కోసం వారిని బలవంతం చేయడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. అలా చేయడం ద్వారా విద్యార్థిని మానసికంగా వేధించడమే అవుతుంది. పాఠశాలలు వాణిజ్య సంస్థల్లా ప్రవర్తించకూడదు. విద్యార్థులను లోనికి రానివ్వకుండా చేయడం విద్యా సంస్థల ప్రాథమిక ధర్మానికి విరుద్ధం. డబ్బు అర్జించడమే లక్ష్యంగా పాఠశాలలు నెలకొల్పలేదు. విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించడం దాని ప్రధాన విధి. పాఠశాలలకు ఫీజుల చెల్లింపునకు సంబంధించి కోర్టు జారీ చేసిన ఆదేశాలు తల్లిదండ్రులు తప్పక పాటించాల్సి ఉంటుంది'' అని న్యాయస్థానం పేర్కొంది.

# రహస్యంగా ఎంపీ మహువా మొయిత్రా వివాహం..

పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. పూరీ మాజీ ఎంపీ, బిజు జనతా దళ్ (బీజేడీ) నేత పినాకీ మిశ్రాను ఆమె వివాహమాడారు. ఇటీవల వీరి పెళ్లి జర్మనీలో రహస్యంగా జరిగింది. సంప్రదాయ దుస్తుల్లో ఉన్న వీరిద్దరికి సంబంధించిన ఫొటోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీని గురించి మహువా, మిశ్రా ఇప్పటివరకు ఎలాంటి అధికార ప్రకటన చేయలేదు.



*** ఎవరీ పినాకీ మిశ్రా..?**

పినాకీ మిశ్రా రాజకీయ నాయకుడు. సుప్రీంకోర్టు న్యాయవాది. దిల్లీలోని ప్రతిష్ఠాత్మక స్టీఫెన్స్ కళాశాల పూర్వ విద్యార్థి. దిల్లీ యూనివర్సిటీ నుంచి లా గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 1996లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన ఒడిశాలోని పూరీ నియోజకవర్గ ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత బిజు జనతాదళ్ (బీజేడీ)లో చేరారు. 2009, 2014లో అదే నియోజకవర్గం నుంచి మళ్లీ గెలుపొందారు. మహువా మొయిత్రా పశ్చిమ బెంగాల్‌లోని కరీంపూర్ ఎమ్మెల్యేగా పని చేశారు. 2019లో టీఎంసీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె కృష్ణనగర్ ఎంపీగా గెలుపొందారు. 2024లో పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినందుకు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో ఆమె లోక్‌సభ సభ్యత్వం కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కృష్ణానగర్ (నడియా నార్త్) లోక్‌సభ నియోజకవర్గం నుంచి 50 వేల పైచిలుకు ఓట్లతో ఆధిక్యంతో ఆమె గెలుపొందారు. అయితే.. ఆమె రహస్యంగా వివాహం చేసుకోవడం తాజాగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# తొక్కిసలాట సమయంలో విధుల్లో 1000 మంది పోలీసులే..

## : హైకోర్టులో కర్ణాటక ప్రభుత్వం వెల్లడి

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిపింది. అయితే, అంతకుముందు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. ఆర్సీబీ ఈవెంట్‌కు 5వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం. తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. ''వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది. ఈ దుర్ఘటన వెనుక కారణాలను తేల్చాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం? అన్నవి



ఆలోచించాలి'' అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ.. ''రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని భద్రతా ఏర్పాట్లు చేశాం. వాటర్ ట్యాంకర్లు, అంబులెన్స్‌లు, కమాండ్ అండ్ కంట్రోల్ వాహనాలను సిద్ధంగా ఉంచాం. ఈ స్టేడియం సామర్థ్యం 35వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ, నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవ్వగా.. సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది'' అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. ఈ విషయంలో న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలిచ్చినా పాటించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొంది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి (జూన్ 10వ తేదీకి) వాయిదా వేసింది.

# 'పహల్గాం' దోషులను ఇంకా పట్టుకోలేదు

## : జైరాం రమేశ్



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి ఇప్పటికీ న్యాయం జరగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్‌అన్నారు. అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రవాదులను ఇంకా పట్టుకోలేదన్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి చినాబ్ ఉక్కు వంతెనను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసేందుకు శుక్రవారం కశ్మీర్‌కు వెళ్లనున్న నేపథ్యంలో జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. పహల్గాం దాడిలో పాల్గొన్న ఇదే ఉగ్రమూక.. 2023 డిసెంబర్‌లో పూంఛ్‌లో, 2024 అక్టోబర్‌లో గుల్‌మార్గ్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల్లోనూ పాల్గొన్నట్లు కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన ఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి ప్రతీకారంగా ఉగ్రవాదుల పీచమణిచేందుకు భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే.

# న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనౌలీకి మధ్యంతర బెయిల్



దిల్లీ: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనౌలీకి మధ్యంతర బెయిల్ మంజూరైంది. 'ఆపరేషన్ సిందూర్'పై సామాజిక మాధ్యమాల్లో తన భావాలను వెల్లడించే క్రమంలో ఒక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆమెకు కలకత్తా హైకోర్టు గురువారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో శర్మిష్ఠకు ఉపశమనం లభించినట్లయింది. మరోవైపు, మే 31న ఆమెను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడంతో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. గత శనివారం న్యాయస్థానం ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

**ఎవరీ శర్మిష్ఠ పనౌలీ?**

కోల్‌కతాలోని ఆనందపుర్ ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పుణె న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం ఆమెకు ఇన్‌స్టాలో 94 వేలమంది ఫాలోవర్లు ఉన్నారు. రాజకీయాలపై తనదైన శైలిలో వ్యాఖ్యలు జోడించి అభిప్రాయాలను బలంగా చెప్పడం ద్వారా శర్మిష్ఠ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సరుగా పేరు సాధించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న పోస్టు చేసిన వీడియో తీవ్ర వివాదాస్పదమై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తన పోస్టులు, రీల్స్ తొలగించి ఆమె క్షమాపణలు కోరారు. శర్మిష్ఠను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే అని డిమాండ్లు పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆమె గురుగ్రామ్‌లో ఉన్నట్టు ట్రాక్ చేసి, శుక్రవారం అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు.

# తొక్కిసలాట ఘటన.. కన్నీళ్లు పెట్టుకున్న డీకే

ఆర్సీబీ విజయోత్సవాల వేళ సంభవించిన తొక్కిసలాట ఘటనలో టీనేజీ పిల్లలు ప్రాణాలు కోల్పోవడం మరింత విషాదకరమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఘటన తర్వాత తొలిసారి మీడియాతో మాట్లాడిన ఆయన ప్రమాదం జరిగిన తీరును తలచుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ బాధను ఏ కుటుంబం భరించలేదన్నారు. ''ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిలో 15 ఏళ్ల టీనేజీ పిల్లలు కూడా ఉన్నారు. మృతుల్లో కనీసం 10 మందిని దగ్గరగా చూశా. ఈ బాధను తట్టుకోవడం ఏ కుటుంబం వల్ల కాదు. ఈ ఘటన నుంచి పాఠాలు నేర్చుకుంటాం. ఓ తల్లి తన కుమారుడి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. కానీ న్యాయపరంగా అది తప్పుదు కదా'' అంటూ డీకే కంటతడి పెట్టారు. ఈసందర్భంగా ప్రతిపక్ష భాజపా విమర్శలపై డిప్యూటీ సీఎం స్పందించారు. పిల్లల మృతదేహాలపై ప్రతిపక్షం రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. ''స్టేడియం వద్ద పరిస్థితి క్షణాల్లోనే చేజారిపోయింది. దాంతో పోలీసు కమిషనర్ వెంటనే నన్ను సంప్రదించి జరిగిన విషయం చెప్పారు. ఒకరిద్దరు అభిమానులు ప్రాణాలు కోల్పోయారని, కార్యక్రమం త్వరగా ముగించాలని కోరారు.

# బిజినెస్ BUSINESS



## త్వరలో టీవీఎస్ ఛైర్మన్‌గా సుదర్శన్ వేణు

టీవీఎస్ మోటార్ కంపెనీ..కొత్త ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా సుదర్శన్ వేణును సంస్థ నియమించింది. ఈ నియామకం 2025, ఆగస్టు 25 నుంచి వర్తిస్తుంది. బోర్డులో తన పదవీకాలంలో TVS మోటార్‌ను స్థిరమైన వృద్ధి, వ్యూహాత్మకంగా నడిపించడంలో వేణు కీలక పాత్రను గుర్తిస్తూ కంపెనీ బోర్డ్ అఫ్ డైరెక్టర్స్ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వేణు, బోర్డు ప్రస్తుత ఛైర్మన్ 'సర్ రాల్ఫ్ స్పెత్' స్థానంలో నియమితులవుతారు. రాబోయే వార్షిక సాధారణ సమావేశం తర్వాత 'సర్ రాల్ఫ్ స్పెత్' ఛైర్మన్ పదవి నుంచి వైదొలుగుతారు. ఆ తర్వాత ఆయన మూడేళ్ల పాటు చీఫ్ మెంటార్‌గా ఉంటారు. డైరెక్టర్‌గా సుదర్శన్ వేణు చేసిన ఆదర్శప్రాయమైన కృషికి గుర్తింపుగా ఆయనను ఛైర్మన్‌గా నియమించినట్లు టీవీఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ.. ప్రపంచవ్యాప్తంగా మరింత అభివృద్ధి చెందడానికి మార్గదర్శకత్వం వహించడంలో దాని ప్రస్తుత ఛైర్మన్ 'సర్ రాల్ఫ్ స్పెత్' కీలక వ్యక్తి అని, స్పెత్ నుంచి నిరంతర మార్గదర్శకత్వం కోసం తాను ఎదురుచూస్తున్నానని కాబోయే ఛైర్మన్ 'సుదర్శన్ వేణు' అన్నారు.

## హైదరాబాద్‌లో రఫేల్ విడిభాగాల తయారీ.. టాటా, డసో మధ్య ఒప్పందం



మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో మరో కీలక ముందడుగు పడింది. భారత వైమానిక దళంలో కీలకంగా వ్యవహరిస్తున్న రఫేల్ యుద్ధవిమానాల తయారీకి సంబంధించి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్ సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రఫేల్ యుద్ధవిమానాలకు చెందిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లోని టీఏఎస్ఎల్‌లో తయారు చేయాలని ఇరు సంస్థలు ఒప్పందానికి వచ్చాయి. రఫేల్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు ఫ్రాన్స్‌కు వెలుపల తయారు కావడం ఇదే తొలిసారి. ఏరోస్పేస్ రంగంలో భారత్ గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని చెప్పడానికి తాజా ఒప్పందాన్ని ఓ ఉదాహరణగా చెప్పొచ్చు. యుద్ధవిమానాల తయారీలో మరింత వేగం పెంచేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనుంది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఫ్యూజ్‌లేజ్ అసెంబ్లింగ్ లైన్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలను ఉత్పత్తి చేసే లక్ష్యంతో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థ ఏర్పాట్లు చేయనుంది. నెలకు రెండు ఫ్యూజ్‌లేజ్‌లను అందించనున్నారు. '' భారత్‌లో మా ఉత్పత్తిని బలోపేతం చేయడంలో ఇది నిర్ణయాత్మక అడుగు. భారత రక్షణ రంగంలో మా సేవలను విస్తరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ నిర్ణయం రఫేల్ విస్తరణకు మరింత దోహదం చేస్తుంది. అంతేకాకుండా నాణ్యమైన సేవలు అందిస్తూ.. సైనిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుంది'' అని డసో ఏవియేషన్ ఛైర్మన్ అండ్ సీఈవో ఎరిక్ ట్రాపియర్ పేర్కొన్నారు. భారత రక్షణ రంగ చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఎండీ సుకరన్ సింగ్ తెలిపారు. డసో ఏవియేషన్ సంస్థతో చేసుకున్న ఈ ఒప్పందం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సామర్థ్యాలను గుర్తు చేస్తుందన్నారు. భారతదేశ వైమానిక వ్యవస్థ అభివృద్ధి, పురోగతిని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని సుకరన్ సింగ్ పేర్కొన్నారు.

## వన్‌ప్లస్ 13ఎస్ వచ్చేసింది.. ధర ఎంతంటే?



చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్ ప్లస్ తన మొట్టమొదటి కాంపాక్ట్ ఫోన్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. వన్‌ప్లస్ 13S పేరిట ఈ మొబైల్స్‌ను తీసుకొచ్చింది. ఏఐ ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్, శక్తిమంతమైన బ్యాటరీతో దీన్ని విడుదల చేసింది. తాజా మొబైల్ లాంచ్‌తో కంపెనీ తన వన్‌ప్లస్ 13 సిరీస్‌ను విస్తరణ వేగవంతం చేసింది. వన్‌ప్లస్ 13ఎస్ కొత్త మొబైల్ 6.32 అంగుళాల 1.5కె ఎల్‌టీపీఓ డిస్‌ప్లేతో వస్తోంది. 120Hz రిఫ్రెష్ రేటు, 1,600 నిట్స్ పీక్‌బ్రైట్ నెస్ కలిగిఉంటుంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్‌తో తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ 15 ఆధారంగా పనిచేస్తుంది. ఏఐ డిటెయిల్ బైస్ట్, ఏఐ అన్‌బ్లర్, ఏఐ రిఫ్లెక్షన్ ఎరేజర్ వంటి టూల్స్ ఉన్నాయి. ఏఐ ట్రాన్స్‌లేషన్, ఏఐ వాయిస్‌స్క్రైబ్, ఏఐ కాల్ అసిస్టెంట్, ఏఐ సెర్చ్ ఫీచర్లు ఉన్నాయి. గూగుల్ జెమిని సర్కిల్ టు సెర్చ్ ఫీచర్‌కు ఈ మొబైల్ సపోర్ట్ చేస్తుంది. ఇక కెమెరా విషయానికొస్తే.. 50 ఎంపీ సోనీ LYT700 ప్రధాన కెమెరా, 50 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, సెల్ఫీ కోసం ముందువైపు 32 ఎంపీ కెమెరాను అమర్చారు. 5,850mAh బ్యాటరీతో వస్తున్న ఈ మొబైల్ 80W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. బ్లూటూత్ 6.0, యూఎస్‌బీ టైప్‌సీ పోర్ట్ కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి. నేటినుంచి ప్రీ బుకింగ్‌లు మొదలుకానున్నాయి, జూన్ 12 నుంచి విక్రయాలు ప్రారంభమతాయని కంపెనీ పేర్కొంది.

## జిన్‌పింగ్‌తో కాల్ మాట్లాడిన ట్రంప్.. ట్రేడ్ డీల్ గురించే చర్చా?



చైనా యూఎస్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో ఇరుదేశాల నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు సమాచారం. యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ రిక్వెస్ట్ చేయడంతోనే జిన్‌పింగ్ ఈ కాల్ మాట్లాడారని చైనా ప్రభుత్వ న్యూస్ ఏజెన్సీ షినువా పేర్కొంది. అయితే ఈ ఇద్దరు లీడర్లు ఏ విషయంపై చర్చలు జరిపారని మాత్రం వెల్లడించలేదు. ఇటీవలే కొన్ని కీలకమైన మినరల్స్ ఎగుమతుల విషయంలో రెండు దేశాల మధ్య సమస్యలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో చైనా ఒప్పందం ఉల్లంఘించిందని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు దేశాల మధ్య 90 రోజుల డీల్ కుదిరిన రోజుల వ్యవధిలోనే ఇలా జరగడం గమనార్హం. దీంతో ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలు చాలా వేడెక్కాయి. ఇలాంటి నేపథ్యంలో ఇరువురు నేతలు కాల్ మాట్లాడుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీళ్లిద్దరూ ట్రేడ్ డీల్ గురించే చర్చించి ఉంటారని నిపుణులు భావిస్తున్నారు.





## భారత్‌పాక్ సమస్యలు తీర్చండి.. రష్యాను కోరిన దాయాది దేశం!

భారత్‌తో తమకున్న సమస్యలను పరిష్కరించాలని రష్యాను పాకిస్తాన్ అభ్యర్థించిందట. ఈ విషయాన్ని రష్యాకు చెందిన ప్రముఖ వార్తాసంస్థ వెల్లడించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ప్రత్యేక సలహాదారు తారీఖ్ ఫతేమీ మాట్లాడుతూ.. 'ఏ క్షణమైనా యుద్ధం మొదలయ్యే పరిస్థితుల్లో ఇరుగుపొరుగు దేశాలు ఉండలేవు. మేం యూఎస్, ఈయూ, రష్యా సహా పలు దేశాలకు అధికారులకు పంపించాం. ఏ దేశమైనా లేదా యూఎన్, మరేదైనా తటస్థ దేశం ఎలాంటి ప్రతిపాదన చేసినా చర్చించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సమావేశంలో కూర్చొని సమస్యను వాళ్లు పరిష్కరించేందుకు సహకరిస్తాం' అని చెప్పినట్లు సమాచారం. కాగా, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాక్‌కు మద్దతు కూడగట్టడం కోసం ఆ దేశం రెండు దౌత్య బృందాలను తయారు చేసి, వాటిని విదేశాలకు పంపిన సంగతి తెలిసిందే.

## అయోధ్యలో రెండో దశ ప్రాణప్రతిష్ఠ పూర్తి.. సీతారాములు విగ్రహాలు చూస్తే కళ్లు చెదిరిపోవాల్సిందే



ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో మరో కీలక ఘట్టం పూర్తయింది. ఈ రోజు (జూన్ 5న) ఉదయం 11:25 గంటలకు రెండో దశలో రామ జన్మభూమి సముదాయంలోని నవ నిర్మిత ఎనిమిది దేవాలయాల లో శివలింగం, ప్రథమ పూజ్య శ్రీ గణేష్, మహాబలి హనుమాన్, సూర్య దేవత, మాతా భగవతి వంటి దేవతల విగ్రహాలకు అనుష్ఠాన పూర్వకంగా ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఆలయ నిర్మాణం పూర్తవడంతో జూన్ 6 నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే అయోధ్యలో మొదట బాల రాముడి విగ్రహం ప్రతిష్ఠించాగా తాజాగా మొదటి అంతస్తులో ప్రధాన ఆలయంలో సీతారాములు విగ్రహాలతో పాటు లక్షణుడు, హనుమంతుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. పాలరాతితో చేసిన ఈ విగ్రహాలను చూస్తే సీతారామచంద్ర మూర్తులు స్వయంగా వచ్చి కూర్చున్నట్లు అనిపిస్తుంది. కాగా అయోధ్యలో కొత్త విగ్రహాలకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## ఎన్ఐఏ దూకుడు.. జమ్మూ కాశ్మీర్‌లో 32 ప్రాంతాల్లో సోదాలు

పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం టెర్రరిస్టులపై భారత ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఐబీ సమాచారంతో ఉగ్రవాదుల జాడలను కనిపెట్టి.. హతమారుస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ దర్యాప్తు సంస్థ సోదాలు జమ్మూ, కశ్మీర్ ప్రాంతాల్లో కంటిన్యూగా సోదాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఈ రోజు ఉదయం నుంచి కాశ్మీర్‌లో 32 ప్రాంతాల్లో సోదాలు కొనసాగిస్తుంది. ఈ సోదాల్లో ఉగ్రవాద సంబంధిత కేసులకు సంబంధించినవని, ప్రత్యేకించి ఓవర్‌గ్రౌండ్ వర్కర్స్ , ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న వారిపై దృష్టి సారించిందని తెలుస్తోంది. ఇవి.. షోపియాన్, కుల్గామ్, పుల్వామా, సోపోర్, కుప్వారా, బారాముల్లా వంటి జిల్లాలో జరుగుతున్నాయి. 2022 లో నమోదైన ఒక కేసుకు సంబంధించిన లష్కర్‌ఎతోయిబా, జైష్‌ఎమహ్మద్ వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న వారి కదలికలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఎన్ఐఏ ఈ సెర్చింగ్ ఆపరేషన్ చేస్తుంది. ఎన్ఐఏ జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసిన భారత ప్రభుత్వం.. సరిహద్దు ప్రాంతాల్లో ఉగ్రవాదులకు లాజిస్టికల్ సహాయం అందించే వారిపై దృష్టి సారించిందని స్పష్టమవుతోంది.

## ఆర్బీఐ కీలక నిర్ణయానికి ముందు
# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

నేడు రెపో రేటుపై ప్రకటన చేయనున్న రిజర్వ్ బ్యాంకు
మార్కెట్లో సానుకూల స్పందన
సెన్సెక్స్ 443 పాయింట్లు ప్లస్.. నిఫ్టీ కూడా లాభాల్లోనే
పెట్టుబడిదారుల్లో రెపో రేటు తగ్గింపుపై ఆశలు.. సూచీల పరుగులు
మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్ల జోరు



**ముంబై:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) రెపో రేటుపై కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నాడు లాభాలతో ముగిశాయి. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినప్పటికీ, సానుకూల సంకేతాలతో సూచీలు ముందుకు సాగాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 443.79 పాయింట్లు (0.55 శాతం) లాభపడి 81,442.04 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 130.70 పాయింట్లు (0.53 శాతం) వృద్ధి చెంది 24,750.90 వద్ద ముగిసింది. లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 378.35 పాయింట్లు (0.65 శాతం) పెరిగి 58,303 వద్దకు చేరగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 175.50 పాయింట్లు (0.96 శాతం) లాభపడి 18,432.60 వద్ద నిలిచింది. నేడు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను వెల్లడించనున్నారు. నిపుణుల అంచనాల ప్రకారం, కేంద్ర బ్యాంక్ ఈసారి రెపో రేటును 0.25 శాతం తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. రంగాల వారీగా చూస్తే, ఐటీ, ఆర్థిక సేవలు, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, మెటల్స్, రియల్టీ, ఎనర్జీ షేర్లు లాభాల్లో ముగియగా, ఆటో, పీఎస్‌యూ బ్యాంకులు, మీడియా, ప్రైవేట్ బ్యాంకుల షేర్లు నష్టాలను చవిచూశాయి.

ఆషికా ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీకి చెందిన సుందర్ కేవత్ మాట్లాడుతూ, "ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండటంతో నిఫ్టీ ఒడిదొడుకుల మధ్య ట్రేడ్ అయింది" అని తెలిపారు. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ తగ్గడం, అమెరికా డాలర్ బలహీనపడటం భారత ఈక్విటీలకు కొంత మద్దతునిచ్చాయని, అయితే అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ సెంటిమెంట్ ఇంకా అప్రమత్తంగానే ఉందని ఆయన పేర్కొన్నారు. డైలీ చార్టులో గోల్డెన్ క్రాసోవర్ కనిపిస్తోందని, ఇది స్వల్పకాలంలో బలమైన అప్‌ట్రెండ్‌కు సంకేతమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన రూపక్ దే మాట్లాడుతూ, "24,500 వద్ద నిఫ్టీకి మద్దతు కొనసాగుతోంది. ఈ స్థాయి కంటే దిగువకు పడిపోతే తప్ప, తీవ్రమైన కరెక్షన్ వచ్చే అవకాశం లేదు. దీనికి విరుద్ధంగా, సమీప భవిష్యత్తులో స్థిరమైన లేదా వేగవంతమైన రికవరీ సాధ్యమే" అని వివరించారు.

మరోవైపు, భారత రూపాయి విలువ పుంజుకుంది. రిస్క్ సెంటిమెంట్ మెరుగుపడటం, విదేశీ నిధుల ప్రవాహం దీనికి దోహదపడ్డాయి. ఇతర ప్రాంతీయ కరెన్సీలలో కనిపించిన సాధారణ బలం కూడా రూపాయికి మద్దతునిచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌కు చెందిన దిలీప్ పర్మార్ మాట్లాడుతూ, "స్థిరమైన ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో ఆర్బీఐ మరోసారి వడ్డీ రేట్లను తగ్గిస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్బీఐ రాబోయే పాలసీ వైఖరి, అది ప్రవేశపెట్టే ఏవైనా ద్రవ్య లభ్యత చర్యలపై రూపాయి భవిష్యత్తు గమనం ఆధారపడి ఉంటుంది" అని తెలిపారు.

# ఇక హైదరాబాద్‌లోనే రఫేల్ విడిభాగాల తయారీ

ఫ్రాన్స్ సంస్థతో టాటా కంపెనీ బిగ్ డీల్



**హైదరాబాద్:** 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో మరో కీలక ముందడుగు పడింది. భారత వైమానిక దళానికి వెన్నెముకగా నిలుస్తున్న రఫేల్ యుద్ధ విమానాలకు సంబంధించిన విడిభాగాల ఉత్పత్తి ఇకపై భారత్‌లోనే తయారు చేయనున్నారు. ఇందుకు హైదరాబాద్ కేంద్రంగా నిలవడం విశేషం. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) మధ్య కీలక ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం ప్రకారం.. ఇకపై రఫేల్ యుద్ధవిమానాలకు చెందిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లోని టీఏఎస్ఎల్ (%ఝ్ఘు ూాఒజఘుఅవివస ూాఎర్వఎం ూాఉఅత్ఉవస%)లో తయారవుతాయి. రఫేల్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు ఫ్రాన్స్ వెలుపల తయారు కావడం ఇదే తొలిసారి. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ విడిభాగాల ఉత్పత్తిని ప్రారంభించాలని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లను సంస్థ వేగవంతం చేయనుంది. నెలకు రెండు ఫ్యూజ్‌లేజ్‌లను అందించనుంది.

భారత రక్షణ రంగ చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెట్ సీఎండీ సుకరన్ సింగ్ తెలిపారు. మరోవైపు ఈ ఒప్పందంపై డసో ఏవియేషన్ ఛైర్మన్ అండ్ సీఈఓ ఎరిక్ ట్రాపియర్ మాట్లాడుతూ.. 'భారత్‌లో మా ఉత్పత్తిని బలోపేతం చేయడంలో ఇది కీలక అడుగు. భారత రక్షణ రంగంలో మా సేవలను విస్తరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ నిర్ణయం రఫేల్ విస్తరణకు మరింత దోహదం చేస్తుంది. అంతేకాదు, నాణ్యమైన సేవలు అందిస్తూ.. సైనిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

## అమ్మకాల్లో మూడో స్థానానికి పడిపోయిన ఓలా..

దూసుకుపోతున్న టీవీఎస్



**న్యూఢిల్లీ:** దేశంలో ఈవీ స్కూటర్ల అమ్మకాల్లో టీవీఎస్ కొత్త రికార్డులను సృష్టించింది. ఈ కంపెనీ వరుసగా రెండోసారి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో అగ్రస్థానంలో నిలిచింది. టీవీఎస్‌కు చెందిన ఐక్యూబ్‌కు మార్కెట్లో బలమైన డిమాండ్ ఉంది. ఈ స్కూటర్ హొసూర్‌కు చెందిన ఓలా వంటి ఇతర బ్రాండ్లను కంటే అమ్మకాల్లో అగ్రస్థానంలో ఉంది. మే 2025లో దేశంలో ఈవీ స్కూటర్ల అమ్మకాలను పరిశీలిస్తే అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో టీవీఎస్ తన స్థానాన్ని నిలుపుకుందని నిపుణులు చెబుతన్నారు. టీవీఎస్ మే 2025లో 24,560 యూనిట్లను అమ్మింది. టీవీఎస్ దాని ఈవీ పోర్ట్‌ఫోలియోలో రెండు ఎలక్ట్రిక్ స్కూటర్‌లను ఐక్యూబ్, ఐక్యూబ్ ఎక్స్ అందుబాటులో ఉంచింది. టీవీఎస్ కొన్ని రోజుల క్రితం అమ్మకాలను పెంచుకునేందుకు ప్రత్యేక ఆఫర్లను కూడా ప్రకటించింది.

ఈవీ స్కూటర్ల అమ్మకాల్లో రెండవ స్థానంలో బజాజ్ చేతక్ ఉంది. మే 2025లో బజాజ్ చేతక్ యొక్క 21,770 యూనిట్లను విక్రయించింది, ఓలా ఎలక్ట్రిక్‌ను అధిగమించింది. ఓలా మే 2025లో మూడో స్థానానికి పడిపోయింది. ఓలా 18,499 యూనిట్లను విక్రయించింది. ఓలా ఎస్1 శ్రేణి తిరిగి పుంజుకున్నా, ధర తక్కువగా ఉన్నా అమ్మకాల్లో మాత్రం మూడో స్థానానికి చేరింది.

## వరుసగా నిరాశపరుస్తున్న
# తెలుగుతేజం!
## ఈసారి రెండో రౌండ్‌లోనే..



జకర్తా: ఒలింపిక్ విజేత పీవీ సింధుకు మరోసారి నిరాశే మిగలింది. ఈ సీజన్‌లో ఒక్క టైటిల్ అయినా గెలవాలనే కసితో ఉన్న ఆమె మరోసారి రెండో రౌండ్ దాటలేకపోయింది. ఈమధ్యే మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత షట్లర్.. ఇండోనేషియా ఓపెన్‌లోనూ ఉసూరుమనిపించింది. గెలవాల్సిన మ్యాచ్‌లో పట్టుకోల్పోయి రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది.

తొలి రౌండ్‌లో చిరకాల ప్రత్యర్థి నొజొమి ఒకుహరకు చెక్ పెట్టిన సింధు.. రెండో రౌండ్‌లో అదే దూకుడును కనబరచలేకపోయింది. గురువారం ఉత్కంఠగా సాగిన పోరులో వరల్డ్ నంబర్ 8 పొర్న్‌పవీ చౌచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో సింధు కంగుతిన్నది. తొలి సెట్‌ను గెలుచుకున్న తర్వాత ప్రత్యర్థికి అవకాశం ఇచ్చి వెనకబడింది. 78 నిమిషాల పాటు సాగిన పోరులో 22-20, 1021, 18-21తో సింధు పరాజయం మూటగట్టుకుంది.

సంతోషంగానే ఉన్నా.. 'నేను ఈ మ్యాచ్ కచ్చితంగా గెలవాలనుకున్నా. మూడో సెట్‌లో 16-13తో ఆధిక్యంలో ఉన్నా. కానీ, ఆ తర్వాత నియంత్రణ కోల్పోయాను. అక్కడి నుంచి పొర్న్‌పవీ దూకుడుగా ఆడి ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. 18 ఆల్ చేసి పోటీలోకి వచ్చాను. ఆ సమయంలో మ్యాచ్ ఎవరైనా గెలిచే అవకాశముంది. మొత్తంగా నా ప్రదర్శన పట్ల సంతోషంగానే ఉన్నాను. ఈరోజు విజయం సాధించి ఉంటే బాగుండేది. ఈ ఓటమితో చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇక త్వరలో జరుగబోయే టోర్నమెంట్‌పై దృష్టి సారిస్తాను' అని మ్యాచ్ అనంతరం సింధు తెలిపింది.

## తొక్కిసలాట మృతులకు ఆర్థిక సాయం




కీలక ప్రకటన చేసిన ఆర్‌సీబీ

**బెంగళూరు:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన నేపథ్యంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నష్ట పరిహారం ప్రకటించింది. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా గాయపడిన వారి సహాయార్థం ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

'నిన్న బెంగళూరులో జరిగిన దురదృష్టకర ఘటన ఆర్‌సీబీ కుటుంబానికి తీవ్ర బాధను కలిగించింది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన 11 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం. అంతేకాదు, గాయపడిన అభిమానులను ఆదుకునేందుకు ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తాం' అని ఆర్‌సీబీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందచేస్తామని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం అందజేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం వెల్లడించారు.

పద్దెనిమిదేండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ టైటిల్‌ని గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును సత్కరించేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని కర్ణాటక ప్రభుత్వం బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీవ్ర విషాదాంతమైన విషయం తెలిసిందే. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట జరిగి 11 మంది మరణించగా, సుమారు 50 మంది గాయపడ్డారు.

ఈ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని, ముందు జాగత్తగా తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఆరోపించింది. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీ స్థాయిలో క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. పాసులు, టికెట్లు ఉన్న వారినే లోపలకు అనుమతించాల్సి ఉన్నప్పటికీ తమ ఆర్‌సీబీ హీరోలను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో స్టేడియం ప్రాంగణం ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది.

## ఘనంగా క్రికెటర్ కుల్‌దీప్ యాదవ్ ఎంగేజ్మెంట్

**లఖ్నో:** భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలైన వంశికను వివాహం చేసుకోబోతున్నాడు. ఈ నేపథ్యంలో వీరి ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగింది. లఖ్నోలో జరిగిన వీరి ఎంగేజ్మెంట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మరోవైపు త్వరలో ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌కు కుల్‌దీప్ ఎంపికైన విషయం తెలిసిందే.



నిశ్చితార్థ వేడుకలో స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో కాబోయే కొత్త జంట ఉంగరాలు మార్చుకుంది. ఇక వీరి వివాహం త్వరలోనే జరగనున్నట్లు తెలుస్తోంది.

కాగా, కుల్‌దీప్ యాదవ్, వంశిక చిన్ననాటి స్నేహితులు. స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో ఇరువురి కుటుంబసభ్యుల అంగీకారంతో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. దీంతో వీరి నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. త్వరలోనే వీరి వివాహం కూడా జరగనుంది. వంశిక ప్రస్తుతం ఎల్ఐసీలో పనిచేస్తున్నట్లు తెలిసింది.



# తొక్కిసలాటపై పెల్లుబికిన ప్రజాగ్రహం..

ఐపీఎల్ ఛాంపియన్ ఆర్సీబీపై కేసు..!




**బెంగళూరు:** ఐపీఎల్ ఛాంపియన్‌గా అవతరించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బిగ్ షాక్. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్ గెలుపొందిన ఆ జట్టు సంబురాల వేడుక విషాదాంతం కావడంతో ప్రజాగ్రహం పెల్లబికింది. దాంతో, పోలీసులు ఆర్సీబీ ఫ్రాంచైజీపై కేసు నమోదు చేశారు. చిన్నస్వామి స్టేడియం సమీపంలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతికి పరోక్షంగా ఆర్సీబీ యాజమాన్యం కూడా కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు పోలీసులు.

యావత్ భారత దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన చిన్నస్వామి తొక్కిసలాటపై కర్నాటక ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. పదకొండు మంది మరణానికి కారణమైన ఈ ఘటనపై విచారణ బాధ్యతలను జిల్లా మేజిస్ట్రేట్ జి.జగదీశకు అప్పగించింది. తొక్కసలాటపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన మేజిస్ట్రేట్ గురువారం ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ ఆర్గనైజేషన్ డీఎన్ఏ ఎంటైర్‌టైన్‌మెంట్‌కు నోటీసులు పంపిస్తామని తెలిపారు. అయితే.. బెంగళూరు పోలీసులు తొక్కిసలాట ఘటనను సుమోటోగా స్వీకరించి ఆర్సీబీ యాజమాన్యంపై, కేసీఏపై కేసు పెట్టారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 105తో పాటు మరో ఐదు సెక్షన్ల కింద ఆర్సీబీ, కేసీఏ, ఈవెంట్ సంస్థపై కేసు పెట్టారు పోలీసులు.

అసలేం జరిగిందంటే..

ఐపీఎల్ ఆరంభం నుంచి కప్ కోసం నిరీక్షిస్తున్న ఆర్సీబీ ఎట్టకేలకు 18వ సీజన్లో ఛాంపియన్‌గా అవతరించింది. తమ అభిమాన జట్టు ట్రోఫీతో స్వరాష్ట్రానికి రావడంతో విక్టరీ పరేడ్ కోసం కన్నడ ప్రజలు భారీగా చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తారు. బుధవారం మైదానంలో కర్నాటకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్సీబీ ఆటగాళ్లను సన్మానించారు. అనతంరం విక్టరీ పరేడ్ ఉంటుందని తెలిసి.. భారీగా అభిమానులు స్టేడియానికి చేరుకున్నారు. మైదానం సామర్థ్యం 35 వేలు కాగా.. బయట దాదాపు 3 లక్షల మంది పోగయ్యారు. ఒక్కసారిగా గేట్లు తెరవడంతో అందరూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది.

అయితే.. కొందరు భారీ కేడ్లను దూకుతూ చొచ్చుకుపోగా.. తొక్కసలాట చోటుచేసుకుంది. ఈ హృదయ విదారక సంఘటనలో 11 మంది మరణించగా.. 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. బౌరింగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాళ్లను పరామర్శించిన సీఎం సిద్ధరామయ్య నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తామని.. గాయపడిన వాళ్లకు ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ మృతులకు రూ.2 లక్షలు, గాయపడినవాళ్లకు రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆర్సీబీ యాజమాన్యం కూడా గురువారం తొక్కిసలాట ఘటనపై విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తామని వెల్లడించింది.

# హరిహర వీరమల్లు మరోమారు వాయిదా?

## విజువల్ ఎఫెక్ట్ పనుల అసంపూర్తితో నిర్ణయం

**టాకీస్:** ఈ నెల 12న రావాల్సిన 'హరిహర వీర మల్లు' వాయిదా పడినట్టే కనిపిస్తోంది! విజువల్ ఎఫెక్ట్స్ పనులు పూర్తి కాకపోవడంతో మరోమారు సినిమాని వాయిదా వేయాలని నిర్ణయించారు. కొత్త తేదీ ఖరారుపై ప్రస్తుతం చిత్రబృందం కసరత్తులు చేస్తోంది. వచ్చే నెలలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తేదీపై



స్పష్టత వచ్చిన వెంటనే చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది. ఐదేళ్ల కిందట మొదలైన ఈ సినిమా, సుదీర్ఘకాలం సెట్స్‌పైనే ఉంది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. 12న విడుదల చేయాలని నిర్ణయించిన చిత్రబృందం, ఆ మేరకు ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించింది. అయితే . పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. నిధి అగర్వాల్ కథానాయిక. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎమ్.రత్నం సమర్పకులు. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ చిత్రానికి కీరవాణి స్వరకర్త.

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఓజీ' చిత్రీకరణ వడివడిగా సాగుతోంది. ఇటీవలే ముంబయి షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురువారం నుంచి విజయవాడలో చిత్రీకరణ చేసుకోనుంది. ఈ షెడ్యూల్‌తోనే సినిమా పూర్తి కానున్నట్టు సమాచారం. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు ఇటీవలే నిర్మాత అధికారికంగా ప్రకటించారు.




# మరో బాలీవుడ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన రష్మిక..

**టాకీస్:** స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న జెట్ స్పీడ్ లో దూసుకెళుతోంది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ లోనూ వరుసగా క్రేజీ ఆఫర్లు అందుకుంటోందీ అందాల తార. ముఖ్యంగా బాలీవుడ్ లో ఈ బ్యూటీకి వరుసగా సినిమా ఛాన్సులు వస్తున్నాయి. ఇటీవల సల్మాన్ ఖాన్ తో కలిసి సికందర్ సినిమాలో నటించింది రష్మిక. రంజాన్ సందర్భంగా విడుదలైన ఈ సినిమా పెద్దగా ఆడలేదు. అయితే ఒక ఫ్లాప్ సినిమా వవచ్చినప్పటికీ, రష్మికకు ఇప్పుడు మరో మంచి బాలీవుడ్ సినిమా అవకాశం వచ్చింది. 2012లో విడుదలైన 'కాక్‌టెయిల్' సూపర్ హిట్ గా నిలిచింది. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొనే, డయానా పెంటీ నటించిన ఈ మల్టీ స్టారర్ మూవీ హిందీ ఆడియెన్స్ ను బాగా అలరించింది. ఒక మోడ్రన్ అమ్మాయి, ఒక ట్రెడిషినల్ లేడీ, ప్లేబాయ్ లాంటి అబ్బాయి మధ్య జరిగే ముక్కోణపు ప్రేమకథ గా ఈ మూవీ తెరకెక్కింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'కాక్‌టెయిల్ 2'నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రష్మికకు హీరోయిన్ పాత్ర ఇచ్చారు. 'కాక్‌టెయిల్ 2' చిత్రానికి లవ్ రంజన్ దర్శకత్వం వహిస్తుండగా, మ్యాడ్‌లాక్ విజయన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'కాక్‌టెయిల్' లాగే, 'కాక్‌టెయిల్ 2' కూడా ముక్కోణపు ప్రేమకథగా తెరకెక్కనుంది. ఇందులో రష్మిక మందన్న ఒక కీలక పాత్రలో నటించనుంది. అలాగే కృతి సనన్ కూడా సెకెండ్ ఫిమేల్ లీడ్ గా యాక్ట్ చేస్తోంది. షాహిద్ కపూర్ ప్లే బాయ్ పాత్రలో కనిపించనున్నాడని సమాచారం. కృతి సనన్, షాహిద్ కపూర్ ఇంతకు ముందు కలిసి నటించారు. కానీ ఆ సినిమా పెద్దగా ఆడలేదు. కానీ షాహిద్ కపూర్, కృతి సనన్ లతో రష్మిక నటించడం ఇదే మొదటిసారి. త్వరలోనే ఈ సినిమా గురించి మరిన్ని అప్ డేట్స్ రానున్నాయి. కాగా ఇప్పటికే బాలీవుడ్ లో 'థామ' అనే హారర్ కామెడీ సినిమా చేస్తోందీ రష్మిక. ఆయుష్మాన్ ఖురానా ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఇక కుబేర, ది గర్ల్ ఫ్రెండ్ సినిమాలు కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# లోకేశ్ కనగరాజ్‌తో అమీర్ చిత్రం

## ధృవీకరించిన బాలీవుడ్ స్టార్



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ ప్రస్తుతం ఆయన చిత్రం 'సితారే జమీన్ పర్' ప్రమోషన్స్‌ల్లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా తాజాగా అమిర్ ప్రెస్ మీట్‌ల్లో పాల్గొని పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన తదుపరి చిత్రాల గురించి కూడా మాట్లాడారు.. ఓ విలేకరి 'పీకే 2' గురించి ప్రశ్నించగా.. 'అది కేవలం ప్రచారం మాత్రమే. ఆ ప్రాజెక్టు గురించి నాకు ఎలాంటి సమాచారం లేదు. 'దాదా సాహెబ్ ఫాల్కే' పై సినిమా చేయడానికి సన్నద్ధమవుతున్నాం. తప్పకుండా సినిమా చేస్తాం. రాజ్ కుమార్ హిరాణీ, నేను ఆ పనిలోనే ఉన్నాం. 'మహాభారతం' పై సినిమా చేయాలని నా 25 ఏళ్ళ కళ. అది కేవలం సినిమా మాత్రమే కాదు. దానిని ఒక యజ్ఞంలా ఎంతో క్రమశిక్షణతో చేయాలి. అందుకు అనుగుణంగా సన్నాహాలు జరుగుతున్నాయి. నా కల నెరవేరుతుందో, లేదో తెలియదు. చూడాలి' అని తెలిపారు. లోకేష్ కనగరాజ్ తో మూవీ గురించి అడగగా..అవును నిజమే.. మేమిద్దరం ఓ సినిమా చేస్తున్నాం. ప్రస్తుతం దాని పనుల్లోనే బిజీగా ఉన్నాం. సూపర్ హీరో జానర్లో ఈ కథ ఉంటుంది. భారీ స్థాయిలో యాక్షన్ మూవీగా రాబోతుంది. వచ్చే ఏడాది జూన్ తర్వాత దీనిని పట్టాలెక్కించాలనుకుంటున్నాం. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్ గురించి ఇంతకు మించి ఏమీ చెప్పలేను. రెండేళ్ల తర్వాత దీని గురించి చర్చించుకుందాం' అని అమిర్ కుండబద్దలు కొట్టాడు. ఆమిర్ ఖాన్, కోలీవుడ్ స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలిసి ఒక సినిమా చేయబోతున్నట్లు గత ఏడాది నుంచి వార్తలు వైరలవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చాడు మిస్టర్ ఫర్‌ఫెక్ట్. భవిష్యత్‌లో లోకేష్‌తో సినిమా ఉండబోతుందని కన్ఫర్మ్ చేశాడు. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమిర్.. లోకేష్ కనగరాజ్‌తో కలిసి ఒక సూపర్ హీరో సినిమా చేయబోతున్నట్లు- అధికారికంగా ధృవీకరించారు. ఇది ఒక భారీ యాక్షన్ సినిమా అని, 2026లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని వెల్లడించారు. 'సితారే జమీన్ పర్' సినిమా విడుదలైన తర్వాత లోకేష్ కనగరాజ్ సినిమానే తన తొలి ప్రాజెక్ట్ అని ఆమిర్ ఖాన్ క్లారిటీ ఇచ్చాడు. ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# రామోజీ ఫిలిం సిటీలో అగ్రతారల సందడి

## ఎన్టీఆర్, ప్రభాస్ మూవీల చిత్రీకరణ

**టాకీస్:** రామోజీ ఫిల్మ్ సిటీలో సినిమాల చిత్రీకరణ హంగామా మళ్లీ మొదలయ్యింది. ప్రస్తుతం ప్రభాస్, ఎన్టీఆర్‌లు ఆర్‌ఎఫ్‌సీలో షూటింగ్‌లతో బిజీబిజీగా గడుపుతున్నారు. భారీ అంచనాలున్న పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ చిత్రం ముందు వరుసలో ఉంటుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ అధికారికంగా మొదలైంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో భాగంగానే ఎన్టీఆర్‌తో పాటు 2000 మంది జూనియర్ ఆర్టిస్ట్‌లతో ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. పీరియాడిక్ మాస్ యాక్షన్ కథతో రూపొందుతున్న ఈ సినిమాకి 'డ్రాగన్' అనే పేరు



పరిశీలనలో ఉంది. ఇందులో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత్ నటిస్తున్నట్లు సమాచారం. కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జూన్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది.

'సలార్', 'కల్కి2898ఏడీ' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరు మీదున్నారు అగ్రకథానాయకుడు ప్రభాస్. ప్రస్తుతం ఆయన తన తదుపరి సినిమాల చిత్రీకరణల్ని పరుగులు పెట్టిస్తున్నారు. ప్రభాస్ ప్రధాన పాత్రలో హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫౌజీ' (వర్కింగ్ –టైటిల్). 1940ల కాలం నాటి కథతో వార్ డ్రామాగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రంతోనే ఇమాన్వి కథానాయికగా పరిచయం అవుతోంది. తాజాగా ఈ సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను ఆర్‌ఎఫ్‌సీలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభాస్‌పై టింబర్ డిపో నేపథ్యంలో సాగే సన్నివేశాలను తీర్చిదిద్దుతున్నారు. చారిత్రక అంశాలతో ముడిపడిన ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి, జయసుధ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# అనుష్కను చూస్తూ కిందపడ్డ వాహనదారులు

## వేదం పోస్టర్‌పై నెట్టింట వైరల్

**టాకీస్:** టాలీవుడ్ గోల్డెన్ లెగ్ అనుష్క గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. మామూలుగా ఒక హీరోయిన్ కెరీర్ మహా అయితే పదేళ్లు ఉంటుంది. గట్టిగా నిలుపుకుంటే మరో 5 ఏళ్లు వేసుకున్న 15 ఏళ్లు. కానీ.. అనుష్క మాత్రం దాదాపు రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో ఉంది. ఉండటమే కాదు.. ఇప్పటికీ అంతే క్రేజ్.సరిగ్గా 2005లో 'సూపర్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ- ఇచ్చి.. ఫస్ట్ సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత మళ్లీ అనుష్క వెనక్కి తిరిగి చూసుకోలేదు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో హిట్ల మీద హిట్లు- కొడుతూ తిరుగులేని క్రేజ్ సంపాదించుకుంది. అయితే కెరీర్ పీక్స్‌లో ఉండగా పాత్రల విషయంలో హీరోయిన్ లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ అనుష్క తన కెరీర్‌లో కొన్ని రిస్కీ పాత్రలు కూడా చేసింది. అందులో ఆమె 'వేదం' చిత్రంలో చేసిన వేశ్య పాత్ర ఒకటి.

దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన ఈ సినిమా రిలీజ్ అయి 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. దీంతో రీసెంట్ ఈ మూవీ రిలీజ్ టైం లో జరిగిన సంఘటన ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే వేదం సినిమా ప్రమోషన్ కోసం అనుష్క పసుపు చీర కట్టుకొని వెనక్కి తిరిగి చూస్తున్న స్టిల్స్ తెగ వాడేశారు. పలు చోట్ల హోర్డింగ్ కూడా పెట్టారు. అయితే పంజాగుట్ట సర్కిల్ లో కూడా అనుష్క వెనక్కి తిరిగి చూస్తున్న ఫొటోని చాలా పెద్దగా పెట్టారట. అయితే అనుష్కని చూస్తూ వాహనదారులు యాక్సిడెంట్ల బారిన పడడం అప్పట్లో చర్చనీయాంశం అయింది. దాదాపు 40 మైనర్ యాక్సిడెంట్స్ జరగడంతో పోలీసులు ఏఐఈ అధికారులతో కలిసి అనుష్క హోర్డింగ్ ని తొలగించారట. ప్రజంట్ ఈ న్యూస్ తెగ వైరల్ అవుతుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.